
సాక్షి అనంతపురం

శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



టన్ను చీనీ రూ.38 వేలు

స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి.



6న జెడ్పీ సమావేశం

జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మే 6న నిర్వహించనున్నట్లు జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఎండీ అమృతరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
40.4°/23.9°

జిల్లా అంతటా గురువారం సూర్యప్రతాపం. ఉక్కపోత అధికంగా ఉంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి.

అక్రమాల రిజిస్ట్రేషన్

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భారీగా వసూళ్లు
- భూముల విలువ తగ్గించి రిజిస్ట్రేషన్లు
- మ్యారేజ్ సర్టిఫికెట్ల జారీకీ ముక్కుపిండి పైకం
- సర్కారు ఆదాయానికి భారీగా గండి
- పెనుకొండ, కదిరి, హిందూపురం కార్యాలయాల్లో ఎక్కువగా గోల్‌మాల్!

- అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న మహిళకు తన తల్లి నుంచి కొంత ఆస్తి సంక్రమించింది. దీన్ని తనపేరుపై మార్చుకునేందుకు కొన్ని రోజుల క్రితం ఆమె అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లింది. పని పూర్తి కావాలంటే రూ.50 వేలు ఇవ్వాలని అక్కడి సిబ్బంది డిమాండు చేయడంతో నర్సు కన్నీటి పర్యంతమైంది. ఈ విషయాన్ని ఆమె వివాదం చేస్తుందేమోనన్న భయంతో సిబ్బంది పని పూర్తి చేశారు.

- రాప్తాడు మండలం జంగాలపల్లెకు చెందిన ఓ రైతు జగనన్న యంత్రసేవ కింద లోను పొందేందుకు అర్హత పొందారు. లోను రావాలంటే భూమిని రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్ట్‌గేజ్ చేయాలని అధికారులు చెప్పారు. దీంతో ఆయన రెండు రోజుల క్రితం రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిని ఆశ్రయించగా రూ.5 వేలు ఇస్తేనే పని చేస్తామని చెప్పారు. అంత డబ్బు లేక బాధితుడు అక్కడి నుంచి వెనుదిరగాల్సి వచ్చింది. ఇవి మచ్చుకు రెండు ఉదాహరణలు మాత్రమే. ఉమ్మడి జిల్లాలో ఉన్న అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాలంటేనే సామాన్యులు భయపడుతున్నారు. ధ్రువపత్రాలు సరిగ్గా ఉన్నా ఏదో ఒక కొర్రీ వేసి అక్కడి సిబ్బంది వసూళ్లకు దిగుతుండడంతో ఆవేదన చెందుతున్నారు. మ్యారేజ్ సర్టిఫికేట్ కావాలన్నా రూ. నాలుగైదు వేలు లంచం లేనిదే పని చేయడం లేదు. అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉండే కొంతమంది మ్యారేజ్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలంటే భారీగా వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. రెండు రోజుల క్రితం అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడులు నిర్వహించిన ఏసీబీ అధికారులు ఒక ప్రైవేట్ వ్యక్తి నుంచి రూ.లక్షల్లో అనధికారిక నగదు స్వాధీనం చేసుకోవడం చూస్తే కార్యాలయంలో అవినీతి, అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

కాగ్ రిపోర్టులో సంచలన విషయాలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఎంత నిఘా ఉంచినా సిబ్బంది చేసేది మాత్రం చేస్తూనే ఉన్నారు. దస్తావేజులను సరైన వర్గీకరణ చేయకపోవడం, ఆస్తుల విలువను తగ్గించి రిజిస్ట్రేషన్లు చేయడం వల్ల సర్కారుకు భారీగా నష్టం వాటిల్లినట్లు కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) రిపోర్టులో తాజాగా తేలింది. కోట్లాది రూపాయల మేర జరిగిన గోల్‌మాల్ బట్టబయలైంది.

పలు రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో అవకతవకలు..

శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలోని హిందూపురం, కదిరి, పెనుకొండతో పాటు, అనంతపురం జిల్లాలోని రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భారీగా అవకతవకలు జరిగినట్టు కాగ్ వెల్లడించిది. భారతీయ స్టాంపు చట్టం 1899 ప్రకారం షెడ్యూల్ 1–ఏ రకరకాల సుంకాలు, రుసుముల రేట్లను తెలియజేస్తుంది.

- పెనుకొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవిభాజ్య స్థల వాటాల అమ్మకాలు వర్గీకరించడంలో తీవ్ర అవకతవకలు జరిగినట్టు కాగ్ పేర్కొంది.
- కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజుల్లో గోల్‌మాల్ చేశారు. ఉమ్మడి ఆస్తిలో దస్తావేజుకు బదులుగా పారీఖత్తు దస్తావేజు (పార్టిసిపేషన్ డీడ్)గా చిత్రీకరించి విలువ తగ్గించారు. దీంతో సర్కారుకు భారీగా నష్టం వాటిల్లింది
- హిందూపురం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో కొన్ని దస్తావేజులను పరిశీలించగా, భూములు, స్థలాల విలువలను భారీగా తగ్గించి రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలింది. దీనివల్ల రూ. కోట్లలో సర్కారు ఆదాయానికి గండి పడింది.

ఏసీబీ రిపోర్టు మేరకు చర్యలు

రుద్రంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో లభించిన డబ్బుపై త్వరలో ఏసీబీ రిపోర్టును బట్టి చర్యలు తీసుకుంటాం. ఆ నివేదిక కోసం వేచి చూస్తున్నాం. మిగతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వచ్చిన ఆరోపణలపైనా విచారణ చేస్తాం. పూర్తయ్యాక చర్యలు ఉంటాయి.

–నాగభూషణం, జిల్లా రిజిస్ట్రార్

పత్తా లేని సబ్‌రిజిస్ట్రార్ అలీ

- ఇన్‌చార్జ్ ఎస్‌ఆర్‌గా శివనారాయణ

అనంతపురం టౌన్: అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ అలీ జాడ కానరావడం లేదు. కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏసీబీ అధికారులు దాడులు చేసి ఆయన డ్రైవర్ షేక్ ఇస్మాయిల్ నుంచి స్వాధీనం చేసుకున్న రూ.2.27 లక్షల అనధికార మొత్తాన్ని సీజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఏసీబీ అధికారులు దాడులు చేసే లోపే మహబుబ్‌అలీ కార్యాలయం నుంచి వెళ్లిపోయాడు. ఇప్పటి వరకూ ఎవరికీ కానరాలేదు. ఫోన్‌లో సైతం అందుబాటులోకి రావడం లేదు. దీంతో జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం రూరల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివనారాయణను ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. కాగా, డ్రైవర్ షేక్ ఇస్మాయిల్ నుంచి స్వాధీనం చేసుకున్న అనధికార మొత్తం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు ఇచ్చారు? అనే విషయంపై ఏసీబీ అధికారులు విచారణ చేస్తున్నారు.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాకు వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: రాగల నాలుగు రోజులూ ఉమ్మడి అనంతపురం జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె. అశోక్‌కుమార్ గురువారం విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపారు. సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో దిగువ ట్రోపో ఆవరణలో వ్యాపించిన అల్పపీడన ద్రోణి, అలాగే ఆగ్నేయ, నైరుతి దిశగా వీస్తున్న గాలుల ప్రభావంతో రాగల నాలుగు రోజులూ తేలికపాటి వర్షాలు కురుస్తాయన్నారు. ముఖ్యంగా ఈనెల 30, మే 1వ తేదీ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో 30 నుంచి 40 కి.మీ వేగంతో బలమైన గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షసూచన ఉందన్నారు.

30న హజ్ యాత్రికులకు శిక్షణ తరగతులు



అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా నుంచి హజ్‌యాత్రకు వెళ్తున్న మహిళలకు ఈ నెల 30న అనంతపురంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు హజ్ ఖదీం మొహమ్మద్ రఫీ తెలిపారు. కోవూరు నగర్‌లోని సయ్యద్ నవీద్ సాబ్ నివాసంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. అలాగే ఈ నెల 29న అనంతపురంలోని చాందినీ మసీదులో హజ్‌కు వెళ్లే పురుషులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 9052095126, 9885274049 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఖైదీల సంక్షేమానికి కృషి

- జైళ్లశాఖ డీఐజీ రాజశేఖర్‌రావ్



పెట్రోల్ బంక్ పనులను పరిశీలిస్తున్న డీఐజీ రాజశేఖర్‌రావ్

రాయదుర్గం: ఖైదీల సంక్షేమానికి కృషి చేస్తామని జైళ్లశాఖ కడప రేంజ్ డీఐజీ కే.రాజశేఖర్‌రావ్ తెలిపారు. గురువారం డీఎస్‌జేఓ అనిల్‌బాబు, జైళ్లశాఖ సూపరింటెండెంట్ ధనుంజయనాయుడుతో కలసి పట్టణంలో జైళ్లశాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ పనులను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో డీఐజీ మాట్లాడారు. రాయదుర్గం జైలు ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఖైదీల్లో మార్పు తీసుకొచ్చి జీవనశైలి మెరుగుపరిచేందుకే పెట్రోల్ బంకుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు.ఉమ్మడి అనంతపురం జిల్లాలో తొమ్మిది సబ్ జైళ్లు ఉండగా, ధర్మవరం, పెనుగొండ, రెడ్డిపల్లి వద్ద పెట్రోల్ బంకులు వినియోగంలోకి తెచ్చామన్నారు. బంకుల ద్వారా వచ్చే ఆదాయంలో పని చేస్తున్న ఖైదీలకు కొంత వేతన రూపంలో చెల్లించి మిగిలిన మొత్తాన్ని జైళ్లలో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ సిబ్బంది ఉన్నారు.

జిల్లాస్థాయిలో మెరిసిన తాటిచెర్ల విద్యార్థి



భీమిరెడ్డి వినయ్ హనిమిరెడ్డి

రాప్తాడురూరల్: ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాల్లో అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల గ్రామానికి చెందిన విద్యార్థి జిల్లాస్థాయిలో మెరిశాడు. భీమిరెడ్డి నాగేశ్వరరెడ్డి, భీమిరెడ్డి నవనీత దంపతుల కుమారుడైన వినయ్‌హనిమిరెడ్డి జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 440 మార్కులకు 434 సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాడు. అనంతపురం నగరంలోని ప్లాస్మా అకాడమీలో చదువుతున్న వినయ్ హనిమిరెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

కిలో టమాట రూ.5

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట రూ.5 ప్రకారం పలికినట్లు ఏడీఎం పి.సత్యనారాయణచౌదరి, రాప్తాడు సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 12 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడి దుర్మరణం



షేక్షావలీ (ఫైల్)



మహమ్మద్ షరీఫ్ (ఫైల్)

గుమ్మఘట్ట: రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు దుర్మరణం పాలైన ఘటన మండలంలో గొల్లపల్లి సమీపంలోని చిత్తయ్యకాలనీ వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. రాయదుర్గం పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో షేక్షావలీ (36), సలీమా దంపతులు నివసిస్తున్నారు. షేక్షావలీ టైలరింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. రెండు రోజుల క్రితం కుమారుడు షరీఫ్ (18 నెలలు)కు చేతి మణికట్టు పైభాగాన కాస్త బెణకడంతో కట్టు కట్టించడానికి గురువారం కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై కర్ణాటకలోని ఊడిమి గ్రామానికి షేక్షావలీ బయలుదేరాడు. గొల్లపల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన ఓ ఐషర్ వాహనం వేగంగా వీరి బైకును ఢీకొంది. తీవ్రగాయాపాలైన తండ్రీకుమారులిద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

'తల్లి'డిల్లిన హృదయం

అల్లారుముద్దుగా పెంచుతున్న ఒక్కగానొక్క కుమారుడితో పాటు ప్రమాదంలో భర్త కూడా మృతి చెందడంతో సలీమా కన్నీటిపర్యంతమైంది. 'ఇప్పుడే వస్తివి.. అంతలోనే వెళ్లిపోతివా తండ్రీ, అన్నం తిని వస్తివి కదా బేటా.. లే బేటా అమ్మ వచ్చింది' అంటూ ఆమె రోదించిన తీరు చూపరులను కన్నీళ్లు పెట్టించింది. ఘటనపై విప్ కాపు రామచంద్రారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు.

బీటెక్ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) బీటెక్ ఫలితాలు గురువారం విడుదల చేసినట్లు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ఈ. కేశవ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి. చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. బీటెక్ మొదటి సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–20) రెగ్యులర్, సప్లిమెంటరీ (ఆర్–15), (ఆర్–19) సప్లిమెంటరీ, ఎంబీఏ మొదటి సెమిస్టర్ (ఆర్–17) సప్లిమెంటరీ, ఎంసీఏ నాలుగు, ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు జేఎన్‌టీయూ(ఏ) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

నేడు 'డాక్ అదాలత్'

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని తపాలా కార్యాలయాల్లో అందించే సేవలపై అభ్యంతరాలుంటే ఈ నెల 28న నిర్వహించే డాక్ అదాలత్‌లో ఫిర్యాదు చేయవచ్చని తపాలా శాఖ పీఆర్‌ఓ ప్రమోద్‌కుమార్ గురువారం తెలిపారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి వచ్చే ఫిర్యాదులను అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ జనరల్ (ఫిర్యాదులు, సంక్షేమం) సుధీర్‌బాబు చూస్తారన్నారు. ఫిర్యాదులను 'చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్, ఏపీ సర్కిల్, విజయవాడ–520013 కార్యాలయానికి పోస్టు ద్వారా పంపవచ్చని వివరించారు. పోస్ట్ కవర్‌పై 'డాక్ అదాలత్' అని పెద్ద అక్షరాలతో రాయాలని సూచించారు.

స్ఫూర్తిదాత భగీరథ మహర్షి



భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత, కలెక్టర్ గౌతమి

- ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత
- ఘనంగా భగీరథ జయంతి

అనంతపురం రూరల్: భగీరథ మహర్షి స్ఫూర్తి ప్రదాత అని, ఆయన చూపిన బాటలో ముందుకెళ్లి ప్రతి పనిలో విజయం సాధిద్దామని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న భగీరథ మహర్షి విగ్రహానికి కలెక్టర్ గౌతమి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఏదైనా పని మొదలుపెడితే దాన్ని సాధించాలనే దృఢ సంకల్పం ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. వెనుకబడిన వర్గాలకు సైతం ఆర్థిక, రాజకీయ ప్రాధాన్యత కల్పించి ఉన్నత స్థానాల్లో నిలబెట్టారన్నారు. నామినేటెడ్ పదవుల్లో సైతం బీసీలకు పెద్దపీట వేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయ భాస్కర్‌రెడ్డి, వాసంతీ సాహితీ, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నవోదయ పరీక్ష

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 42 కేంద్రాల ఏర్పాటు
- డీఈఓ సాయిరామ్
- సీఎస్,సీఎల్‌ఓలకు శిక్షణ



అభ్యర్థికి నియామక ఉత్తర్వు అందజేస్తున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడు రూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈనెల 29న జరిగే జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. సాయిరామ్ ఆదేశించారు. గురువారం ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో పరీక్ష నిర్వహణపై సీఎస్, సీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ, నవోదయ పరీక్షకు 8,774 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 42 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అన్ని కేంద్రాల్లోనూ వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, వేసవిని దృష్టిలో ఉంచుకుని ఫ్యాన్లు, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందు నాయక్, నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు పాల్గొన్నారు.

48 మందికి నలుగురు హాజరు

రాప్తాడు రూరల్: డీఎస్సీ–98 అభ్యర్థులకు ప్రభుత్వం మరోసారి కౌన్సెలింగ్ నిర్వహించగా, 48 మందికిగాను నలుగురు మాత్రమే హాజరయ్యారు. గతంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన 48 మందికి ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పిస్తూ గురువారం డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించింది. నలుగురు మాత్రమే హాజరుకాగా, అందుబాటులో ఉన్న ఖాళీలను చూపించి వారికి డీఈఓ సాయిరామ్ నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీలు కృష్ణయ్య, ఉదయ్‌భాస్కర్, సూపరింటెండెంట్ శ్రీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

1,229 మంది టీచర్లకు నోటీసులు

ఆన్‌లైన్ యాప్‌లో ఆలస్యంగా హాజరు వేసిన 1,229 మంది ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ గురువారం నోటీసులు జారీ చేశారు. ఉపాధ్యాయులంతా రోజూ నిర్దిష్ట సమయానికి స్కూల్ అటెండెన్స్ యాప్‌లో హాజరు నమోదు చేయాల్సి ఉంది. ఈనెల 26న జిల్లాలోని 1,229 మంది టీచర్లు యాప్‌లో ఆలస్యంగా హాజరు నమోదు చేశారు. దీనిపై కమిషనర్ కార్యాలయం ఐటీ సెల్ విభాగం నివేదిక ఇవ్వగా, సదరు టీచర్లను సంజాయిషీ కోరుతూ డీఈఓ నోటీసులు జారీ చేశారు. డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు వారి పరిధిలోని టీచర్లకు నోటీసులు అందజేసి ఆలస్యంగా హాజరు నమోదు చేసినందుకు కారణాలపై సమీక్షించి నివేదికలను డీఈఓ కార్యాలయానికి పంపాలని సూచించారు.

ధైర్యంగా ఉండమ్మా..

- మీ సమస్య పరిష్కరించమని సీఎం గారే స్వయంగా చెప్పారు
- దివ్యాంగురాలికి కలెక్టర్ గౌతమి హామీ



దివ్యాంగురాలు ఆదినారాయణమ్మ సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: 'అమ్మా.. సీఎం గారే స్వయంగా నన్ను పిలిచి మీ గురించి చెప్పారు. సమస్యలు పరిష్కరిస్తాం. ధైర్యంగా ఉండండి' అని కలెక్టర్ ఎమ్.గౌతమి దివ్యాంగురాలు ఆదినారాయణమ్మకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 26న నార్పలకు విచ్చేసిన సందర్భంలో ఆయన్ను యల్లనూరు మండలం దంతెలపల్లికి చెందిన ఆదినారాయణమ్మ కలిశారు. ఈ క్రమంలోనే సీఎం ఆమెకు.. కలెక్టర్‌ను కలవాలని చెప్పడంతో పాటు సమస్య పరిష్కరించాలని కలెక్టర్ గౌతమిని ప్రత్యేకంగా ఆదేశించారు. దీంతో ఆదినారాయణమ్మ గురువారం తన భర్త రామశివకర్‌రెడ్డితో పాటు కలెక్టరేట్‌కు వచ్చింది. కలెక్టర్ స్వయంగా చాంబర్ నుంచి కిందికి వచ్చి ఆమెతో మాట్లాడారు. తనకు ఇద్దరు కుమార్తెలని పెద్దమ్మాయి ఇడుపులపాయ ఐఐటీలో పనిచేస్తోందని, రెండో అమ్మాయి రాజంపేటలో బీటెక్ చేస్తోందని ఆదినారాయణమ్మ చెప్పింది. పెద్దమ్మాయికి ఇక్కడే ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కోరింది. తాము ఉంటున్న ఇల్లు పడిపోయే స్థితిలో ఉందని కొత్తది మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. తనకు మూడు చక్రాల వాహనం ఇప్పించాలని విన్నవించింది. కంటికి ఆపరేషన్ జరిగినా, నీరు కారుతోందని, కుడికాలు పనిచేయడం లేదని వాపోయింది. ఆమె చెప్పిన సమస్యలను ఆర్‌డీఓ మధుసూదన్ నోట్ చేసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. మూడు చక్రాల వాహనం తెప్పించి ఇస్తామని చెప్పారు. ఆరోగ్య శ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డిని పిలిపించి కాలు, కంటికి చికిత్స చేయించాలని ఆదేశించారు. కుమార్తెకు ఏదేని ఉద్యోగం ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

దివ్యాంగుల శ్రేయస్సే లక్ష్యం

అనంతపురం అర్బన్: దివ్యాంగుల శ్రేయస్సే లక్ష్యమని కలెక్టర్ ఎమ్.గౌతమి తెలిపారు. దివ్యాంగుల హక్కుల చట్టం- 2016 ప్రకారం వారి సంక్షేమానికి జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిలాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకోసారి సమీక్ష నిర్వహిస్తామన్నారు. వికలాంగుల హక్కులు, నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వీలైనంత త్వరగా కమిటీలో నామినేటెడ్ సభ్యులను ఎంపిక చేయాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్‌ను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లోకి దివ్యాంగుల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉండేలా ర్యాంపులు ఏర్పాటు చేయించాలని పంచాయతీ రాజ్ ఎస్ఈ భాగ్యరాజ్‌ను ఆదేశించారు. ప్రతి పభుత్వ కార్యాలయంలో ఒక గెజిటెడ్ స్థాయి అధికారిని నియమించాలన్నారు. దివ్యాంగులకు కేటాయించిన పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడంతో పాటు విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. క్రీడా పోటీల్లో జిల్లావాసుల ప్రాతినిధ్యం పెంచాలన్నారు. సమావేశంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అదృశ్యం


నదీం హుసేన్


షాకీరాభాను

తాడిపత్రి అర్బన్: పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. జయనగర్‌కాలనీకి చెందిన నదీం హుసేన్ (19) అనే విద్యార్థి వరంగల్‌లోని ఎస్ ఆర్ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. ఇటీవల నదీం హుసేన్ ఇంటికి వచ్చాడు. సక్రమంగా చదువుకోవడం లేదంటూ తండ్రి బాషాజాన్ కుమారుడిని మందలించాడు. ఈనెల 25న నదీం హుసేన్‌ను వరంగల్‌కు బస్సు ఎక్కించాడు. అయితే నదీం హుసేన్ యూనివర్సిటీలోని హాస్టల్‌కు వెళ్లకపోవడంతో కళాశాల యాజమాన్యం ఈ విషయాన్ని విద్యార్థి తండ్రి బాషాజాన్‌కు ఫోన్ లో చెప్పారు. దీంతో గురువారం బాషాజాన్ పట్టణ పోలీసులను ఆశ్రయించారు.

కళాశాలకు వెళ్తానని చెప్పి...

పట్టణంలోని అమ్మవారిశాల వీధికి చెందిన దూదేకుల షాకీరాభాను (21) స్థానిక జేసీ నాగిరెడ్డి డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. అయితే ఎప్పటిలాగే షాకీరాభాను గురువారం ఉదయం తన ఇంట్లో కళాశాలకు వెళతానని చెప్పి తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో తండ్రి లాలెప్ప పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనదారుడా మేలుకో!

- అధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- ఫ్యూయల్‌తో పాటు వాహనాలు కండీషన్‌లో ఉంచుకోవడమే బెటర్
- జాగ్రత్తలతోనే ప్రమాదాలకు చెక్‌పెట్టొచ్చంటున్న నిపుణులు

భానుడు భగ భగా మండిపోతున్నాడు. ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదు అవుతుండటంతో జనం అల్లాడిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యంగా వాహనదారులు కూడా జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరిస్తున్నారు.


ఇటీవల జాతీయ రహదారిపై కాలిపోతున్న కంటైనర్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎండకు కాలిబూడిదైన వాహనం... కారు టైరు పేలడంతో ప్రమాదం... తరచూ ఇలాంటి వార్తలను మనం చూస్తూనే ఉన్నాం. ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలీని పరిస్థితి. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలకు చెక్ పెట్టొచ్చని జిల్లా పోలీసు, అగ్నిమాపక శాఖ, రవాణాశాఖ, ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు.

ప్రణాళికతో పనులు

పనులు ఏవైనా సరే ఉదయం, సాయంత్రం వేళల్లో చేసుకోవడమే మేలు. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ప్రయాణం చేయడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉద్యోగం, బాధ్యతలు, వృత్తిని బట్టి కాలంతో సంబంధం లేకుండా కొందరు పనులు చేస్తూనే ఉండాలి. వాహనాలకు కూడా నిత్యం పని చెప్పాల్సిందే. విడి కాలాలు ఎలా ఉన్నా ఎండాకాలంలో మాత్రం వాహనదారులు తప్పకుండా జాగ్రత్తలు పాటించాలి.

వాహనం కండిషన్‌లో ఉంచాలి

కారు, బైకు వాహనం ఏదైనా సరే కండిషన్‌లో ఉంచడం చాలా ముఖ్యం. ఎండాకాలంలో సాధారణం కంటే వాహనాలపై ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయించాలి. బైకు ఉన్న వాళ్లు ఇంజిన్ ఆయిల్ నిర్దేశిత కిలోమీటర్లలోపు మార్చుకోవడం మంచిది. వాహన బ్యాటరీ చెక్ చేయించుకోవడం ఉత్తమం. కార్లు ఉన్న వాళ్లు ఇంజిన్ ఆయిల్, కూలెంట్ ఆయిల్, ఏసీ ఫిల్టర్లు, బ్యాటరీ కండిషన్ చెక్ చేయించుకోవాలి. కార్లను ఆపకుండా నిరంతరాయంగా ప్రయాణం చేయకుండా మధ్య మధ్యలో బ్రేక్ ఇవ్వడం మంచిది.

ఎలక్ట్రికల్ వాహనాలతో జాగ్రత్త

ఇప్పుడు అధిక శాతం మంది ఎలక్ట్రిక్ బైకులు, కార్లు తెగ కొనేస్తున్నారు. అయితే ఎండలతో ఈవీ ఓనర్లు చాలా జాగ్రత్తగా ఉండాని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా మంది ఎలక్ట్రిక్ వెహికల్స్‌ని సాధారణ బండ్లు మాదిరే వాడేస్తున్నారు. వాటికి చార్జింగ్ పెట్టే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. బ్యాటరీ వేడిగా ఉన్న సమయంలో చార్జ్ చేయకూడదు. అలాగే అధిక ఎండలకు వాహనాలను నిలపకపోవడమే మేలంటున్నారు.

ఎక్కువ దూరం వద్దు

బైక్‌పై ప్రయాణించేవాళ్లు ఎక్కువ దూరాలు వెళ్లకపోవడమే మేలు. ఒకవేళ తప్పని పరిస్థితుల్లో ఉదయం, సాయంత్రం ప్రయాణించడం మంచిది. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం ముఖ్యం. మీ బ్యాగులో వాటర్ బాటిల్ ఉండేలా చూసుకోండి. ప్రమాదకర కిరణాల నుంచి కాపాడుకునేందుకు.. కళ్లకు షేడ్స్ వాడితే మంచిది.

ఫుల్ ట్యాంకుతో ముప్పే



ఎండాకాలంలో ప్రధానంగా పెట్రోల్, డీజిల్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలకు ఆయిల్ ఆవిరవ్వడమే కాదు.. ఫ్యూయల్ ఎక్కువగా ఉంటే బండి పేలిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. అందుకే ఫుల్ ట్యాక్ చేయించే అలవాటు ఉన్నవాళ్లు అవసరాన్ని బట్టి ఫ్యూయల్ పోయించుకోండి. బైకులు వాడేళ్లు ట్యాంక్‌కి ఏదైనా క్లాత్, ట్యాంక్ కవర్ వంటివి వాడితే మంచిది. రోజులో కనీసం ఒక సారైనా వాహనం పెట్రోలు ట్యాంకరు మూత తీసి మళ్లీ ఉంచడం మంచిది. లేదంటే ట్యాంకు గ్యాస్‌తో నిండిపోయి పేలిపోయే ప్రమాదం ఉంది.

టైర్లపై దృష్టి పెట్టండి



“ఎండాకాలంలో రోడ్లు ఎంతో వేడిగా ఉంటాయి. తారు రోడ్లు అయితే సెగలు కక్కుతుంటాయి. ఆ వేడి మొత్తాన్ని ముందుగా గ్రహించేది బండి టైర్లే. కాబట్టి వాటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండాకాలంలో సాధ్యమైనంత వరకు తక్కువ దూరమే ప్రయాణం చేయడం మంచిది. పాత టైర్లను వాడకపోవడమే ఉత్తమం. టైర్లలో పరిమితికి మించి గాలి పెట్టించకూడదు. లేకపోతే బయట వేడిమి, లోపల పీడనం వల్ల టైర్లు పేలిపోయే ప్రమాదం ఉంది.

– శివరాంప్రసాద్, డీటీసీ

దంతలపల్లిలో ఇరువర్గాల ఘర్షణ

- ఒకరి పరిస్థితి విషమం.. మరో నలుగురికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన బాలవెంకటరెడ్డి, ఆదినారాయణరెడ్డి


తిరుపతిలో చికిత్స పొందుతున్న రామాంజినేయులు

యల్లనూరు: మండలంలోని దంతలపల్లిలో ఉపాధి హామీలో అక్రమాలు, అవకతవకలపై బుధవారం రాత్రి ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. ఎస్ఐ రామకృష్ణ వివరాల మేరకు... ఉపాధి పనులకు వెళ్లకున్నా మస్టర్లల్లో ఊర్లో లేని వారి పేర్లను రాసుకుంటున్నారు, తమపై ఎందుకు కక్ష సాధిస్తున్నావని వలంటరీ వంశీ ... ఫీల్డ్ అసిస్టెంట్ అమర్‌నాథ్ రెడ్డిని ప్రశ్నించాడని తెలిపారు. అయితే తమనే ప్రశ్నిస్తావా అంటూ సర్పంచి అన్న శివనాగిరెడ్డి, సర్పంచి నాగమహేశ్వరరెడ్డితో పాటు మరికొందరు వలంటీర్ వంశీ ఇంటి వద్దకు చేరుకొని వంశీని కొట్టారన్నారు. అడ్డు వచ్చిన అతని తండ్రిని సైతం గాయపరిచారని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న బాలవెంకటరెడ్డి, ఆయన అన్న ఆదినారాయణరెడ్డితో పాటు మరికొందరు అక్కడికి చేరుకొని జరిగిన సంఘటనపై తెలుసుకుంటుండగా ఒక్కసారిగా సర్పంచి అన్న శివనాగిరెడ్డితో పాటు మరి కొందరు కలిసి బాలవెంకటరెడ్డి వర్గీయుల కళ్లల్లోకి కారంచల్లి వేటకొడవలి, రాడ్లతో దాడులు చేసుకున్నారు. ఇరువర్గాల ఘర్షణలో సర్పంచి వర్గానికి చెందిన రామాంజినేయులు అనే వ్యక్తికి తలకు తీవ్రగాయాలు కావడంతో తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. రామాంజినేయులు పరిస్థితి విషమంగా ఉంది. హరికుమార్ తలకు గాయాలయ్యాయి. అలాగే బాలవెంకటరెడ్డితో పాటు ఆదినారాయణరెడ్డి, రఘునాథరెడ్డికి తలకు, కాళ్లు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆదినారాయణరెడ్డి తలకు తీవ్రగాయాలు కావడంతో అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సర్పంచి నాగమహేశ్వర రెడ్డి వర్గంలోని హరికుమార్ ఫిర్యాదు మేరకు గురువారం బాలవెంకటరెడ్డి వర్గీయులైన ఏడుగురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. దంతలపల్లిని సీఐ వేణుగోపాల్ సందర్శించారు. ఇరువురు ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాలీలో ఉచిత శిక్షణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరులో ఉచితంగా ట్యాలీలో శిక్షణ అందించనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. 10వ తరగతి నుంచి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు 18 ఏళ్ల నుంచి 26 ఏళ్ల లోపు ఉండాలన్నారు. 35 రోజుల పాటు వసతి, భోజనంతో కూడిన శిక్షణ ఇస్తామన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో అత్యుత్తమ శిక్షణ అందిస్తామన్నారు. కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 90004 87423 నంబరుకు సంప్రదించాలన్నారు.

‘కాలవ’కు మైండు దొబ్బింది

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



అనంతపురం క్రైం: ‘నార్పలలో రెండ్రోజుల క్రితం జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభ విజయవంతమైంది. వసతి దీవెన కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ శ్రేణులు తరలిరావడాన్ని తట్టుకోలేక మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులకు మైండు దొబ్బి అసత్య ప్రచారాలు చేస్తున్నారు’ అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య విమర్శించారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం సభను విజయవంతం చేసిన ప్రజలకు, పార్టీ శ్రేణులకు, అభిమానులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సీఎం సభకు ప్రజాదరణ లేక యూనివర్సిటీ విద్యార్థులను తరలించారని మాజీ మంత్రి కాలవ ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వేలాది మంది స్వచ్ఛందంగా సీఎం సభకు వచ్చారని పేర్కొన్నారు. ఇటీవల టైమ్స్‌నౌలో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 25 ఎంపీ స్థానాలు సాధిస్తుందని తేల్చడంతో మాజీ మంత్రి ఒత్తిడికి లోనై నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మాజీ సీఎం చంద్రబాబు వ్యవసాయం దండగ అని రైతులను నిర్లక్ష్యం చేశారని, సీఎం వైఎస్ జగన్ మాత్రం వ్యవసాయాన్ని పండుగ చేసి చూపారన్నారు. ఇప్పటికైనా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు చౌకబారు రాజకీయాలు మానుకోవాలని, రానున్న రోజుల్లో ప్రజలు మరోసారి టీడీపీకి బుద్ధి చెబుతారన్నారు.

టీడీపీ నాయకులవి పగటి కలలే..

- మాజీ ఎమ్మెల్యే విశ్వ



బెళుగుప్ప: జిల్లాలోని టీడీపీ నాయకులు పగటి కలలు కంటూ.. ప్రభుత్వ ఏర్పాటు చేస్తామన్న ఊహల్లో ఉండగా.. సీఎం జగన్ నార్పల సభ విజయవంతం కావడంతో వారి భ్రమలన్నీ తొలగిపోయాయని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని దుద్దేకుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశ్వ మాట్లాడారు. నార్పలలో నిర్వహించిన జగనన్న వసతి దీవెన బహిరంగ సభకు జనాల నుంచి బ్రహ్మాండమైన స్పందన వచ్చిందన్నారు. టీడీపీ మాజీ ఎంపీ కాలవ శ్రీనివాసులు వాస్తవాలు తెలుసుకోకుండా సీఎంను విమర్శించడం సిగ్గుచేటన్నారు. సీఎం జగన్ ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి హామీలు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుతం సీఎం బహిరంగ సభలకు జన స్పందన చూస్తేంటే మునుపటి ప్రజాసంకల్పయాత్రను తలపిస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో హిందూపురం, ఉరవకొండ సీట్లను కూడా తప్పకుండా గెలుస్తాం ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీల సంఘం అధ్యక్షులు పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, బెళుగుప్ప, ఆవులెన్న సహకార సంఘాల అధ్యక్షుడు శివలింగప్ప, శ్రీనివాసులు, జెడ్పీటీసీ మమత తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


మహేష్ (ఫైల్)

కణేకల్లు: ఇంటర్ విద్యార్థి మంగళి మహేష్ (17) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ దుగ్గిరెడ్డి కథనం మేరకు.. కణేకల్లు మండలం పెనకలపాడుకు చెందిన మంగలి రామాంజినమ్మ, శ్రీనివాసుల కుమారుడు మహేష్ ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. పరీక్షల సమయంలో పరీక్షలు రాస్తున్నాడని అనుకున్న తల్లిదండ్రులకు కొడుకు పరీక్షలు రాయలేదని ఆ తర్వాత తెలిసింది.. దీంతో పని నేర్చుకునేందుకు మహేష్ రోజూ బార్బర్ షాపుకు వెళుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఇంటర్ రిజల్ట్స్ వచ్చాయి. వరుసకు సోదరి అయిన పొరుగునున్న బంధువుల అమ్మాయి పాస్ కావడంతో తల్లిదండ్రులు పరీక్ష రాసి ఉంటే నువ్వు కూడా పాసయ్యేవాడివంటూ బాధపడ్డారు. రోజూ మాదిరిగా మహేష్ బుధవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటిపై భాగంలో ఉన్న గదిలో పడుకునేందుకు వెళ్లి మనస్తాపంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఉదయం కుమారుడు విగతజీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బ్యాంకు ఖాతా నుంచి రూ.40 వేలు మాయం

గార్లదిన్నె: మండల కేంద్రానికి చెందిన రామాంజినేయులు అనే సప్లయర్ బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.40 వేలు కొట్టేశారు. బాధితుడి వివరాలమేరకు... మండలంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో 217010100006427 బ్యాంకు ఖాతా నుంచి ఈనెల 22 నుంచి నుంచి 26వ తేదీ దాకా నాలుగు సార్లు మొత్తం రూ.40 వేలు విత్‌డ్రా చేసినట్లు రామాంజినేయులు సెల్‌ఫోన్‌కు మేసేజ్ వచ్చింది. దీంతో వెంటనే సంబంధిత బ్యాంకుకు వెళ్లి సిబ్బందిని సంప్రదించగా సైబర్ నేరగాళ్ల పని అని తెలపడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో గురువారం రాత్రి మస్తాన్ బీ అనే మహిళ మెడలోని బంగారు చైన్‌ను ఓ దొంగ అపహరించాడు. వివరాల్లోకి వెళితే... తాడిపత్రి రోడ్డులో దుకాణంలో కూర్చొని ఉండగా ద్విచక్ర వాహనంలో వచ్చిన దుండగుడు ఒక్క ఉదుటను ఆమె మెడలోని బంగారు చైన్‌ను లాక్కెళ్లాడు. బాధితురాలు గట్టిగా అరవడంతో స్థానికులు చైన్ స్నాచర్‌ను పట్టుకోవడానికి వెంట పడ్డారు. అయినా దొంగ మాత్రం వారికి దొరకలేదు. ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలు మస్తాన్‌బీ ఇచ్చి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

పుట్లూరు: మండలంలోని కుమ్మనమల గ్రామానికి చెందిన నల్లప్ప (50) విషపు గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాలమేరకు.. నల్లప్ప గత కొంత కాలంగా కడుపునొప్పితో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపు గుళికలు మింగి ఆత్మహత్యాయత్నం చేయగా గమనించిన కుటుంబ సభ్యులు తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గురువారం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లుతుండగా మార్గమధ్యలో మృతి చెందారన్నారు. మృతుడికి భార్య నల్లమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం


చిరుధాన్యాలపై ఏర్పాటు చేసిన సదస్సుకు హాజరైన ప్రముఖులు

ప్రశాంతి నిలయం: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం గోరంట్ల సమీపంలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో చిరుధాన్యాలు – ఆరోగ్యం, పోషక విలువలు అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి, యూనివర్సిటీ చైర్మన్ భరత్‌లాల్‌మీనా, చాన్సలర్ డాక్టర్ రూపా వాసుదేవన్ జ్యోతి అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వల చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ భరత్‌లాల్ మీనా మాట్లాడుతూ ఆధునిక కాలంలో మానవుని ఆహారపు అలవాట్లు ఆరోగ్యవంతమైన జీవితాన్ని నియంత్రిస్తున్నాయన్నారు. పోషకాలు లోపించిన ఆహారం, కలుషిత ఆహారం మూలంగా ఆరోగ్యాన్ని కోల్పోవాల్సివస్తోందన్నారు. చిరుధాన్యాలతో మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. డాక్టర్ రూపా వాసుదేవన్ మాట్లాడుతూ నేటి ప్రపంచంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఒక పెద్ద సవాలుగా మారిందన్నారు. చక్కటి పోషక విలువలను కలిగిన చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యభాగ్యం పొందవచ్చునన్నారు. అనంతరం చిరుధాన్యాల రకాలు, వాటిలో లభించే పోషకాలు, వాటి సాగు, ఆవశ్యకత, సాగు పద్ధతులు వంటి అంశాలపై వక్తలు చర్చించారు. కార్యక్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ సీనియర్ సైంటిస్ట్ కెబీఆర్ఎస్ విశారద, విశ్రాంత రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ శంకర్, ఆంగ్రూ, ఏఆర్ఎస్ అనంతపురానికి చెందిన డాక్టర్ సీవీ చంద్రమోహన్‌రెడ్డి, ప్రకృతి వనం ఫౌండర్ ఎంసీవీ ప్రసాద్, డాక్టర్ టీఎస్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక


జిల్లా జట్టు కెప్టెన్‌గా ఎంపికైన సంతోష్

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా అండర్–23 వన్డే క్రికెట్ జట్టును గురువారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ నెల 28 నుంచి మే 4వ తేదీ వరకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలో నిర్వహించనున్న అండర్–23 సౌత్‌జోన్ వన్డే క్రికెట్ టోర్నీలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనుంది. జిల్లా జట్టుకు సంతోష్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

జిల్లా క్రికెట్ జట్టు : సంతోష్, దత్తారెడ్డి, అర్జున్ టెండూల్కర్, మహేంద్రరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, దీపక్, యోగానంద, ఖాదర్‌వలి, కామిల్, శ్రీనివాస్, రోహిత్‌రోషన్, విఘ్నేష్ దినకర్, చైత్రవర్ధన్, ప్రశాంత్, జయకృష్ణ, జయంత్‌కృష్ణ స్టాండ్‌బైలు: జీవన్‌సాహిత్, రేవంత్‌రెడ్డి, వికాస్, ఆరిఫ్ రజా, లోహిత్ సాయి కిశోర్, వెంకట్ లోకేష్

క్లుప్తంగా

జామియా ఆస్తులు పరిరక్షించండి



వినతిపత్రం అందిస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, జమాత్ సభ్యులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జామియా ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అధికారి మూస ఇబ్రహీంను జామియా మసీదు ముస్లింలు గురువారం విన్నవించారు. జామియా మసీదు ముతవల్లీలు సస్పెండ్ అయ్యారని, వారిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. జామియా మసీదు ఆస్తుల వివరాలు, పలు విషయాలపై చర్చించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, జమాత్ సభ్యులు మన్సూర్ బాషా, చాంద్‌బాషా, మోహెబ్, తబ్రేజ్, రియాజుద్దీన్, అర్షద్, దాదా ఖలందర్, నూర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

అనంతపురం టవర్‌క్లాక్: ప్రతిఒక్కరూ సేవా భావం అలవర్చుకోవాలని పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దన్నగౌడ్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు శీలా జయరామప్ప, రామకృష్ణ, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

విధులకు హాజరు కాకపోతే చర్యలు



గొందిరెడ్డిపల్లి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సాల్మన్

రాప్తాడు: గ్రామ సచివాలయ ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కాకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ సాల్మన్ అన్నారు. ఆయన గురువారం గొందిరెడ్డిపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. పథకాలను ప్రతి ఇంటికీ అందించాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై ఉందన్నారు.

నేడు ముస్కాన్ బృందం రాక

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిని ముస్కాన్ బృందం శుక్రవారం తనిఖీ చేయనుంది. ఆస్పత్రిలో ఉన్న న్యూట్రిషన్ రిహ్యాబిలిటేషన్ సెంటర్ (ఎన్‌ఆర్‌సీ), పీడియాట్రిక్ వార్డు, ఫార్మసీ విభాగాలను బృందం పరిశీలించనుంది.

అగ్నిమాపక అధికారిని కలిసిన 'అపుస్మా' నాయకులు



అగ్నిమాపక అధికారికి బొకే అందిస్తున్న అపుస్మా నాయకులు

రాప్తాడురూరల్: జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డిని ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) నాయకులు గురువారం కలిశారు. ప్రైవేట్ పాఠశాలల అనుమతులు, రెన్యూవల్స్‌కు సంబంధించిన ఫైర్ సర్టిఫికెట్ జారీ అంశాలపై చర్చించగా, ఆయన సానుకూలంగా స్పందించారు. అపుస్మా జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి, స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్ కె.రామిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, నాయకులు లక్ష్మీ స్కూల్ మధుసూదన్‌రెడ్డి, జలీల్, నాగరాజు, రామచంద్రారెడ్డి, నగర కార్యదర్శి రవిశంకరప్రసాద్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆత్మకూరు: ఆత్మకూరు బీసీకాలనీ సమీపంలో గురువారం పేకాట ఆడుతుండగా ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ రవిప్రసాద్ తెలిపారు. వారి నుంచి రూ.3770 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పెరిగిన వరి గడ్డి ధరలు



ఆత్మకూరులో వరి గడ్డి అమ్మేందుకు వచ్చిన ట్రాక్టర్లు

ఆత్మకూరు: మండలంలో వరి సాగు తక్కువగా ఉండటంతో వరిగడ్డి దొరకడం కష్టంగా మారింది. దీంతో ఏటా కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల నుంచి వందలాది ట్రాక్టర్ల వరి గడ్డి తెచ్చి ఆత్మకూరులో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం వరి గడ్డి ధర పెరిగింది. ఒక ట్రాక్టర్ వరి గడ్డి ధర రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు చెప్పున్నారు. ట్రాక్టర్ వరి గడ్డి కొనుగోలు చేయాలంటే రూ.10 వేలు కావాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. ఏటా పాడి పశువుల సంఖ్య ఎక్కువగా అవుతుండటంతో వరి గడ్డి ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయని రైతులు వాపోతున్నారు. గత ఏడాది రూ.8 వేలు ట్రాక్టర్ ఉండేదని ప్రస్తుతం పది వేలకు పైగా పెరగడంతో కొనుగోలు చేసే రైతులు కూడా తక్కువయ్యారని రైతులు అంటున్నారు.

ఫైళ్లు చిత్తుకాగితాల్లా తెస్తే ఎలా?



టౌన్ ప్లానింగ్ విభాగం సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ రమణారెడ్డి

- నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: ప్రతి ఫైల్ ఈ ఆఫీస్ ద్వారా రావాల్సిందేననీ, చిత్తు కాగితాల్లాగా తీసుకొస్తే ఎలా? అని నగరపాలక సంస్థ సిబ్బందిపై కమిషనర్ రమణారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. గురువారం నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ విభాగంలోని సూపరింటెండెంట్‌పై ఆయన మండిపడ్డారు. అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ భవనాలకు సంబంధించిన పత్రాలు, తదితర వాటిని ఈ ఆఫీస్ ద్వారానే తన లాగిన్‌కు పంపాలన్నారు. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సిబ్బందికి ఇచ్చే మెమోలను ఈ ఆఫీస్‌లో పొందుపర్చాలన్నారు.

బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌కు రెండో మెమో:

టౌన్ ప్లానింగ్ విభాగం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణకు నగరపాలక సంస్థ కమిషనర్ రెండో మెమోను జారీ చేశారు. నాలుగు రోజుల క్రితం మురళీకృష్ణకు కమిషనర్ మెమో జారీ చేసిన విషయం విదితమే. గురువారం కమిషనర్ 57, 58వ సచివాలయాల పరిధిలోని 5, 6వ రోడ్డు, ఆజాద్‌నగర్‌లో పర్యటించారు. 5వ రోడ్డులో ఓ నిర్మాణాన్ని కమిషనర్ పరిశీలించగా, అతిక్రమణలను (డీవియేషన్స్) గుర్తించారు. ప్రారంభ దశలోనే ఎందుకు గుర్తించలేదని బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, ప్లానింగ్ కార్యదర్శి ధనుంజయపై మండిపడ్డారు. వారిద్దరితో పాటు లైసెన్స్ టెక్నికల్ పర్సన్‌కు కమిషనర్ మెమో జారీ చేశారు.

పన్ను రాయితీకి మూడ్రోజులే గడువు

ఇంటి పన్ను ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ వస్తుందని, అందుకు కేవలం మూడ్రోజులు మాత్రమే గడువుందని కమిషనర్ రమణారెడ్డి అన్నారు. గురువారం నగరపాలక సంస్థలో కమిషనర్ రమణారెడ్డి మాట్లాడారు. పాతూరు కూరగాయలమార్కెట్ పక్కన ఉన్న 17వ సచివాలయం, రాంనగర్ మీసేవ పక్కన ఉన్న 54వ సచివాయం, రెండో రోడ్డు స్టడీ పార్క్ వద్ద ఉన్న 64వ సచివాలయం, నవోదయ కాలనీ వద్ద ఉన్న 41వ వార్డు సచివాలయాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, నగరపాలక సంస్థలోని కౌంటర్లలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటలలోపు చెల్లించే అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు.

జీపీఎఫ్ స్లిప్‌లు వచ్చేలా చూడండి



ఏటీఓ రాణికి వినతిపత్రం అందిస్తున్న నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: నాల్గో తగరతి ఉద్యోగులకు సంబంధించి జీపీఎఫ్ (భవిష్య నిధి) స్లిప్‌లు వచ్చేలా చూడాలని సహాయ ఖజానా అధికారి (ఏటీఓ) రాణికి నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు విన్నవించారు. గురువారం ఏటీఓని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, గౌస్‌పీరా, ఇతర నాయకులు డీడీ చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేసి, సమస్య వివరించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీపీఎఫ్ స్లిప్‌లు రాలేదన్నారు. నాలుగు డీఏలను కలిపి ఆ తరువాత తొలగించిన్పటి నుంచి ఈ సమస్య ఉందన్నారు. జీపీఎఫ్‌కు తాము ప్రతి నెలా ఎంత మొత్తం చెల్లిస్తున్నామో కనిపిస్తోందని, అయితే తమ ఖాతాలో ఎంత మొత్తం ఉందనేది రాలేదన్నారు. అప్‌డేట్ చేస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. కాబట్టి తమ సమస్యను డీడీ ద్వారా ప్రభుత్వం తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పెద్దన్న, భాస్కర్, వాజిద్‌బాషా, ముక్తియార్, ప్రకాశ్, లక్ష్మీదేవి, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయమంతా రజిత మయమే



వాసవీమాత జయంతి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్యం సంఘం ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: వాసవీ జయంతి సందర్భంగా ఈసారి పెద్ద ఎత్తున నగరోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపా మచ్చానరసింహులు అన్నారు. గురువారం వాసవీ జయంత్యుత్సవాల పుస్తకాలు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మునుపటి కంటే ఘనంగా అనంత ప్రత్యేకత చాటుతూ వాసవీ జయంతి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కొత్తూరు అమ్మవారి శాలను ఆసాంతం వెండి రేకులతో తాపడం చేయించామన్నారు. ఈనెల 30న ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు వైశ్యాహాస్టల్ నుంచి భారీ ఊరేగింపు , వాసవీ హోమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టంగుటూరు నాగభూషణ, సూర్యప్రకాష్, క్రిష్టం రఘు, తల్లం మురళి, పువ్వాళ భాస్కరరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాదరక్షల పంపిణీ



విద్యార్థులకు పాదరక్షలు అందచేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని ఆత్మకూరు, పి. యాలేరు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రంలోని 114 మంది విద్యార్థులకు ఒట్టెం సూర్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు అమర్‌నాథ్‌రెడ్డి పాదరక్షలు గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం ఏటా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరోగ్యంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అతికిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఓబులు

బుక్కరాయసముద్రం: కార్మికుల చట్టాలను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు అధికారులను కోరారు. గురువారం సిద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న పసుపుల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఆఫీస్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్మికులకు రావాల్సిన బకాయిలు, పరిహారం సక్రమంగా అందించేలా చూడాలన్నారు. వేలాది మంది ప్రావిడెంట్ ఫండ్ ఖాతాల్లో పేర్ల తప్పులు, ఆధార్ లింక్ కాకపోవడం జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం పీఎఫ్ కమిషనర్ అశ్వని రాజు మాట్లాడుతూ పీఎఫ్‌ను సక్రమంగా అమలు చేసేలా చర్యలు చేపడుతామన్నారు. ప్రతి నెలా 27న పీఎఫ్ అంశంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. పీఎఫ్ కార్యాలయం ఈఓ శ్రీనివాసనాయక్, చంద్రశేఖర్, వాటర్ సప్లయ్ యూనియన్ నాయకులు ఓబులేసు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసనగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం



బళ్లారి బైపాస్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం

దాహం తీరుస్తున్న దాతలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగ మండుతుండడంతో అనంత వాసులు అల్లాడుతున్నారు. వడగాలులు దడపుట్టిస్తున్నాయి. ఎండ వేడిమి తాళలేక బయటకు అడుగుతీసి అడుగు వేయాలన్నా జనం జడుసుకుంటున్నారు. చల్లని పానీయాలుగానీ, మంచినీరుగానీ కొనాల్సి వస్తోంది. దీంతో నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో దాహం తీర్చేందుకు దాతలు ముందుకొచ్చారు. పలు కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. బళ్లారి బైపాసు రోడ్డులోని అయ్యంగార్ బేకరీ సమీపంలో ఐదేళ్లుగా భగవాన్ సత్యసాయిబాబా పేరిట నరసింహారెడ్డి అనే దాత చలి వేంద్రం ఏర్పాటు చేసి, మినరల్ వాటర్‌ను అందిస్తున్నారు. శ్రీనివాస నగర్‌లో బలిజ మహా సంఘం ఆధ్వర్యంలో అతిపెద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్ నుంచి నుంచి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ఇక్కడ చలివేంద్రం ఏర్పాటు చేశారు.రోజువారి రెండు ట్యాంకర్ల నీరు సరఫరా చేస్తున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఏటా చలివేంద్రం ఏర్పాటు చేస్తామని సంఘం తీర్మానించింది.

పుస్తకం నవజీవన వికాసిని



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి

అనంతపురం: పుస్తకం అనేది నవజీవన వికాసిని అని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అన్నారు. ఎస్కేయూ కామర్స్ విభాగం అకడమిక్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ జి. రామప్రసాద్ రెడ్డి, ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మోహన్ రెడ్డి సంయుక్తంగా రచించిన «ఫైనాన్షియల్ పర్‌ఫార్మెన్స్ ఆఫ్ సెలెక్ట్ రియల్ ఎస్టేట్ కంపెనీస్ । అనే పుస్తకాన్ని వీసీ గురువారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ కంపెనీపై ఫైనాన్స్ ఎలా ప్రభావం చూపుతుందనే అంశంపై పుస్తకం రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, కంప్యూటర్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. రఘునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



'జగనన్న మా భవిష్యత్తు' పోస్టర్లను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు

రాప్తాడు: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని వైస్ ఎంపీపీ, జేసీఎస్ ఇన్‌చార్జ్ బోయ రామాంజినేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రం రాప్తాడులో 'జగనన్న మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి ఇంటింటికీ వెళ్లి పలకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి గడపకూ వెళతారని తెలిపారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం కనుకే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామని చెప్పారు. టీడీపీకి ప్రజల్లోకి వెళ్లే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు మ్యానిఫెస్టోపై ప్రజలకు నమ్మకం పోయిందని, చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. రామోజీరావు, రాధాకృష్ణా, టీవీ 5 లాంటి పచ్చ మీడియా ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నాయన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పథకాలను వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు సాకే చంద్ర, జయన్న, చిరుతల నాగేంద్ర, సచివాలయ కన్వీనర్లు అభి, వలంటీర్ ముత్యాలు, విజయ్, గోపి పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'మోడల్' విద్యార్థుల ప్రతిభ

రాప్తాడు: ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం పరీక్ష ఫలితాల్లో ఏపీ మోడల్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 46 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 17 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. వీరిలో ఎంపీసీలో పుష్పితకు 416 మార్కులు, బైపీసీలో ప్రణతికి 401 మార్కులు, సీఈసీలో కావేరికి 434 మార్కులు వచ్చాయి. రెండో సంవత్సరం ఫలితాల్లో 61 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, వారిలో 38 మంది విద్యార్థులు పాసయ్యారు. బైపీసీ గ్రూపులో రిషివర్ధినికి 943 మార్కులు, ఎంపీసీలో దివిజకి 401 మార్కులు, సీఈసీలో కావేరికి 434 మార్కులు వచ్చాయి.

డీఐజీని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు



డీఐజీ అమ్మిరెడ్డితో వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: అనంతపురం నూతన డీఐజీ అమ్మిరెడ్డిని వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస రెడ్డి, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధాశ్రమం సందర్శన



అబ్జర్వేషన్ కేంద్రంలో బాలురతో మాట్లాడుతున్న గరికపాటి దీనబాబు

అనంతపురం: అనంతపురంలోని బాలుర అబ్జర్వేషన్ కేంద్రం, అమ్మ ఒడి వృద్ధాశ్రమం, వన్‌స్టాప్ సెంటర్‌ను జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ గరికపాటి దీనబాబు గురువారం సందర్శించారు. వారితో మమేకమై వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బాలల చట్టం పై అవగాహన కల్పించారు. ఆహారం, నివాసం, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

నేడు ఆజాద్‌నగర్‌లో గడప గడపకూ...

అనంతపురం క్రైం: 40వ డివిజన్‌లో ఆజాద్‌నగర్‌లో శుక్రవారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నడిమివంక బ్రిడ్జి దాటిన తర్వాత కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డు, ఆజాద్‌నగర్ నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

జెడ్పీలో ఆకస్మిక తనిఖీలు



జెడ్పీలోని 'ఏ' సెక్షన్ ఉద్యోగులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయంలోని పలు సెక్షన్లను చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఉద్యోగులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యాలయ పని మీద వచ్చే వారికి అందుబాటులో ఉండి, వారి పనులు పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. ఉద్యోగులందరూ కచ్చితంగా ముఖ హాజరు వేయాలని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి



జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు

ఆత్మకూరు: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని రాప్తాడు నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండలంలోని బి.యాలేరు, సనప, తోపుదుర్తి సచివాలయాలు, జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. సచివాలయాల వారీగా రిజిష్టర్లను తనిఖీ చేశారు. ప్రభుత్వ భవణాలను సందర్శించి, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చేయాలని సూచించారు. జగనన్న లేఅవుట్‌లలో లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణ బిల్లులు లబ్ధిదారుల ఖాతాలకు వెంటనే జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్, హౌసింగ్ ఏఈ శ్రీధర్, ఎంఈఓ నరసింహారెడ్డి, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక రుగ్మతలు దూరం



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జాతీయ సేవాపథకం వలంటీర్లు

అనంతపురం: యోగాతో మానిసిక, శారీరక రుగ్మతలు తొలగించుకోవచ్చని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్.ఆర్. సదాశివారెడ్డి అన్నారు. మనిషి మనుగడ సాధించడానికి యోగా ఒక్కటే శరణ్యమని అన్నారు. జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్-క్యాంపస్ ఆర్ట్స్ కళాశాల) ఆధ్వర్యంలో వారం రోజులుగా జాతీయ సేవా పథకం శిబిరాన్ని నిర్వహించారు. ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ పాల్గొని ఉత్తేజ పూరితమైన ప్రసంగం చేశారు. కార్యక్రమంలో బీఈడీ కళాశాల బోధన సిబ్బంది , ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి



టవర్‌క్లాక్ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా, డీఐఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం అర్బన్: మహిళా క్రీడాకారులపై లైంగిక దాడులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజు భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గురువారం నిరసన తెలిపారు. టవర్‌క్లాక్ సమీపంలోని మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ ప్రపంచంలో దేశానికి కీర్తిని తీసుకొచ్చిన రెజ్లర్లకు సరైన గౌరవం ఇవ్వకపోగా లైంగిక దాడులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. క్రీడాకారిణులు ధర్నా చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, నాయకులు రామాంజనమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, పరమేష్, నరసింహ, కృష్ణమూర్తి, నూరుల్లా, శివ, వన్నూరుస్వామి, రజిత, అరుణమ్మ పాల్గొన్నారు.

సహ చట్టంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న మోటివేటర్ ప్రత్యూష సుబ్బారావు

అనంతపురం కల్చరల్: సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని పలువురు వక్తలు అన్నారు. గురువారం సహ చట్టం పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్‌నగర్ కాలనీలో సహచట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన సమావేశాల్లో సంఘం ప్రతినిధులు వన్నూరప్ప, నబీ రసూల్, రషీద్‌బాషా, తోట బాలన్న , దేవి కృష్ణయ్య తదితరులు సహ చట్టం అమలు తీరుపై మాట్లాడారు. సీనియర్ రచయిత తరిమెల అమరనాథరెడ్డి, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రత్యూష సుబ్బారావు, జనార్దన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005లో వచ్చిందని, చాలా మందికి కనీస అవగాహన లేదన్నారు. రానున్న రోజుల్లో పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని తీర్మానించారు. అంతకు ముందు ఆదినారాయణ ఆలపించిన ఉద్దీపన గీతాలు ఆకట్టుకున్నాయి.

నేడు హుండీ కానుకల లెక్కింపు

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఐదు శాశ్వత హుండీల్లోని కానుకలను శుక్రవారం ఉదయం 8 గంటలకు ఆలయ అధికారుల సమక్షంలో లెక్కించనున్నారు. ఈ మేరకు ఈఓ కె.విజయ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కనగానపల్లి: మండల పరిధిలోని పాతపాళ్యం సమీపంలో గురువారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో అనిల్‌కుమార్ (21) అనే యువకుడు చనిపోయాడు. పోలీసుల వివరాలమేరకు.. నూతిమడుగుకు చెందిన అనిల్‌కుమార్ తన మిత్రులతో కలసి పాతపాళ్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు వచ్చాడు. తిరిగి తన మిత్రులు మహేష్, మల్లికార్జునలతో కలసి పాతపాళ్యం నుంచి తగరకుంటకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఎదురుగా మరో ద్విచక్ర వాహనంలో వస్తున్న మద్దెలచెరువు పవన్‌కుమార్ అనే యువకుడు వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అనిల్‌తో పాటు అతని మిత్రులిద్దరూ గాయపడ్డారు. వారిని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే తీవ్రంగా గాయపడిన అనిల్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు.

వైభవంగా భగీరథ మహర్షి జయంతి

గుత్తి: పట్టణంలో గురువారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఉప్పర(సగర) సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మొదట చెంబుల బావి వీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు.